# సినిమా న్యూస్

## వెంకీ మూవీలో రోహిత్ ఎంట్రీ

విక్టరీ వెంకటేష్,త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో రాబోతున్న లేటెస్ట్ మూవీ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం.47.' ఇందులో వెంకటేష్ సరసన శ్రీనిధిశెట్టి హీరోయిన్‌గా నటిస్తుండగా.. హారిక అండ్ హాసిని క్రియేషన్స్ బ్యానర్‌పై రాధాకృష్ణ నిర్మిస్తున్నారు. ఈ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను దసరా కానుకగా.. అక్టోబర్ 2న థియేటర్స్‌లోకి తీసుకు రాబోతున్నారు. ఇందులో వెంకటేష్ మధ్యతరగతి కుటుంబ పెద్దగా కనిపించనున్నారు. ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రేక్షకుల్లో, అభిమానుల్లో అపారమైన అంచనాలు ఉన్నాయి. ఈ సినిమా అప్‌డేట్స్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఫ్యాన్స్‌కు చిత్ర యూనిట్ ఒక బిగ్ సర్ ప్రైజ్ ఇచ్చింది. ఈ సినిమాలో వర్సటైల్ యాక్టర్ నారా రోహిత్ ఒక పవర్ ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించబోతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. నారా రోహిత్ పాత్రకు సంబంధించిన వివరాలను ప్రస్తుతానికి రహస్యంగా ఉంచినప్పటికీ, ఆయన ఫస్ట్ లుక్ పోస్టర్ మాత్రం సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టిస్తోంది. పోస్టర్‌లో రోహిత్ సిగరెట్ కాలుస్తూ, సీరియస్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన వెనుక పోలీస్ అని రాసి ఉన్న బోర్డ్ స్పష్టంగా కనిపిస్తుండటంతో, ఆయన ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ క్యారెక్టర్‌లోనే అలరించబోతున్నారని అర్థమవుతోంది. త్రివిక్రమ్ మార్క్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు రోహిత్ పోలీస్ క్యారెక్టర్ తోడవడంతో ఈ సినిమాపై అంచనాలు మరింత రెట్టింపయ్యాయి.




## నోలన్ మూవీకి భారీ వసూళ్లు

హాలీవుడ్ స్టార్ దర్శకుడు క్రిస్టోఫర్ నోలన్ తెరకెక్కించిన 'ది ఓడిస్సీ' చిత్రం తాజాగా ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. ఈ సినిమాపై తెలుగు ప్రేక్షకులతో పాటు దేశవ్యాప్తంగా సినీ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఆ అంచనాలకు తగ్గట్టుగానే విడుదలైన తర్వాత ఈ చిత్రానికి ఇండియా వ్యాప్తంగా మంచి పాజిటివ్ టాక్ లభించింది. దీంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన వసూళ్లను రాబడుతోంది. విడుదలైన తొలి ఆరు రోజుల్లోనే ఇండియా వ్యాప్తంగా రూ.100 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్లు సాధించిన ఈ సినిమా, ఏడో రోజు రూ.6.15 కోట్ల నెట్ వసూళ్లను నమోదు చేసింది. మొత్తంగా తొలి ఏడు రోజుల్లో రూ.107.72 కోట్ల గ్రాస్ కలెక్షన్లను రాబట్టింది. ప్రస్తుతం కూడా ఈ చిత్రం దేశవ్యాప్తంగా విజయవంతంగా ప్రదర్శితమవుతుండటంతో, ఫుల్ రన్ ముగిసే సమయానికి ఇండియన్ బాక్సాఫీస్ వద్ద మరిన్ని సంచలనాలు సృష్టించే అవకాశం ఉందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.





## వివాదంలో ధృవ్ విక్రమ్

కోలీవుడ్ స్టార్ హీరో విక్రమ్ తనయుడిగా ఇండస్ట్రీకి వచ్చిన ధృవ్ విక్రమ్ ఓ వివాదంలో చిక్కుకున్నట్లు వార్తలు వైరల్ అవుతున్నాయి. ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ ఆయనపై నిలాద్రి ప్రొడక్షన్స్, పెన్ స్టూడియోస్ సంస్థలు తమిళ ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశాయి. డైరెక్టర్ రమేష్ వర్మ దర్శకత్వంలో చేయాల్సిన సినిమా కోసం ధృవ్ విక్రమ్ కోటి రూపాయల అడ్వాన్స్ తీసుకుని, తమను మోసం చేశాడని నిర్మాతలు ఆరోపిస్తున్నారు. ఈ సినిమా కోసం భారీగా సెట్లు వేసి, పాటల చిత్రీకరణకు కూడా అధిక మొత్తంలో ఖర్చు చేసినట్లు నిర్మాతలు వెల్లడించారు. అంతా సిద్ధమై షూటింగ్ ప్రారంభమయ్యే సమయానికి, తమకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో కరణ్ దర్శకత్వంలో రాబోయే తన 'DV4' చిత్రాన్ని ప్రారంభించేందుకు ధృవ్ ఒప్పుకున్నారని వారు పేర్కొన్నారు.

నిజానికి ముందస్తు ఒప్పందం ప్రకారం రమేష్ వర్మ ప్రాజెక్ట్ మొదట DV4గా రావాల్సి ఉంది. మైత్రీ మూవీ మేకర్స్ ప్రాజెక్ట్ DV5గా తర్వాత తెరకెక్కాల్సి ఉంది. కానీ ధృవ్ విక్రమ్ మాత్రం మైత్రీ మూవీస్ ప్రాజెక్ట్ పూర్తయిన తర్వాతే రమేష్ వర్మ సినిమా చేస్తానని చెప్పడంతో తీవ్ర అసంతృప్తికి గురైన నిర్మాతలు, ధృవ్ తమకు సరైన సమాచారం ఇవ్వకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అందుకే న్యాయం చేయాలని కోరుతూ తమిళ ఫిల్మ్ ఛాంబర్‌లో ఫిర్యాదు చేశారని సమాచారం. ప్రస్తుతం ఈ వార్త సోషల్ మీడియాలో తీవ్రంగా వైరల్ అవుతోంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన పోస్టులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఈ విషయంపై ధృవ్ విక్రమ్ అధికారికంగా స్పందిస్తే కానీ అసలు విషయాలు బయటకు రావు.

## 'బేబీ'ని మించిన హిట్

థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'చెన్నై లవ్ స్టోరీ' సక్సెస్ మీట్‌లో దర్శకుడు సాయి రాజేష్, హీరో కిరణ్ అబ్బవరం సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 'బేబీ' తర్వాత మరోసారి విజయాన్ని అందుకున్న చిత్రబృందం సినిమా కోసం పడిన కష్టం గురించి మాట్లాడింది. ఈ సక్సెస్ మీట్‌లో రైటర్ సాయి రాజేష్ మాట్లాడుతూ తాము కేవలం ఒక సినిమా విజయంతో నిలిచిపోయే వాళ్లు కాదని నిరూపించుకోవాలనే పట్టుదలతో 'చెన్నై లవ్ స్టోరీ'ని తెరకెక్కించామని అన్నారు. ఈ సినిమా కోసం అందరూ ఎంతో కష్టపడ్డారని, వ్యక్తిగతంగా తనకు 'బేబీ' కంటే ఈ మూవీనే ఎక్కువగా నచ్చిందని చెప్పారు. నిర్మాతలు ధీరజ్ మొగిల్నేని, ఎస్‌కేఎన్ ఎంతో మంది పేరున్న హీరోయిన్లను పక్కనపెట్టి, తెలుగు అమ్మాయి గౌరీ ప్రియను ఎంపిక చేయడం తనకు చాలా ఆనందాన్ని ఇచ్చిందన్నారు.

ఆమెకు కథ చెప్పగానే ఎలాంటి సందేహాలు లేకుండా అంగీకరించి ముందుకు వచ్చిందని వెల్లడించారు. సినిమాలో అనంత్ శ్రీరామ్ రాసిన పాటలన్నీ ప్రత్యేకంగా నిలిచాయని, ముఖ్యంగా 'చిరునవ్వుతో' పాట తన దృష్టిలో గొప్ప పాటగా నిలిచిపోతుందని దర్శకుడు కొనియాడారు. హీరో కిరణ్ అబ్బవరం ఉండటంతో సినిమా ప్రచారం గురించి తాను పెద్దగా ఆలోచించాల్సిన అవసరం రాలేదని చెప్పారు. ఒక హీరోలా కాకుండా నిర్మాతలా బాధ్యత తీసుకుని సినిమా కోసం కష్టపడ్డారని, ఇప్పటికీ ఆయనకు ఇవ్వాల్సిన పారితోషికంలో కొంత బకాయి ఉందని సరదాగా వెల్లడించారు. కాల్‌షీట్లతో సంబంధం లేకుండా పగలు రాత్రి అనే తేడా లేకుండా షూటింగ్‌కు వచ్చి సహకరించారని ప్రశంసించారు.



హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ అనంత్ శ్రీరామ్ రాసిన 'చిరునవ్వుతో' పాట తన కెరీర్‌లో చిరస్థాయిగా గుర్తుండిపోయే పాటగా నిలుస్తుందని అన్నారు. సినిమాటోగ్రాఫర్ విశ్వాస్‌తో కలిసి చేసిన ప్రతి సినిమా బ్లాక్‌బస్టర్‌గా నిలిచిందని, ఈ చిత్రంతో ఆ సెంటిమెంట్ మరోసారి కొనసాగిందని చెప్పారు. తనకంటే ముందే ఇండస్ట్రీలోకి వచ్చిన త్రిగుణ్ ఈ పాత్రను అంగీకరించి సినిమా కోసం నిలబడటం గొప్ప విషయమన్నారు. ఇక హీరోయిన్ గౌరీ ప్రియ గురించి మాట్లాడుతూ, ఒక అబ్బాయిలా పగలు రాత్రి తేడా లేకుండా షూటింగ్‌లో పాల్గొని ఎంతో అంకితభావంతో పనిచేసిందని కిరణ్ ప్రశంసించారు. నిర్మాత ఎస్‌కేఎన్ చిన్నపిల్లాడిలా సినిమాపై ప్రేమతో పనిచేస్తారని, హిట్ సాధించాలనే తపనతో అవసరమైతే డబుల్ కాల్‌షీట్లు కూడా ఏర్పాటు చేస్తూ చిత్రబృందానికి అండగా నిలిచారని అన్నారు.

సాయి రాజేష్ కథ చెప్పిన మొదటి రోజే ఈ సినిమా తన కెరీర్‌లో పెద్ద హిట్ అవుతుందని చెప్పారని, ఇప్పుడు అదే నిజమైందని కిరణ్ వెల్లడించారు. ప్రారంభంలో ఈ పాత్రను తాను న్యాయం చేయగలనా అనే భయం ఉన్నప్పటికీ, ఇప్పుడు ఫ్యామిలీ ఆడియన్స్ కూడా థియేటర్లలో ఎమోషన్స్ కి గురవుతూ సినిమాను ఆదరిస్తుండటం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 'చెన్నై లవ్ స్టోరీ' విజయంతో చిత్రబృందం ఆనందం వ్యక్తం చేస్తూనే, మంచి కథ ఉంటే ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకాన్ని మరోసారి వ్యక్తం చేసింది. హీరో కిరణ్ అబ్బవరం, శ్రీ గౌరి ప్రియ జంటగా నటించిన 'చెన్నై లవ్ స్టోరీ" సినిమాని అమృత ప్రొడక్షన్స్, మాస్ మూవీ మేకర్స్ బ్యానర్స్ పై ఎస్ కేఎన్, ధీరజ్ మొగిల్నేని నిర్మించారు. సాయి రాజేష్ కథను అందించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకత్వం వహించారు.

## 40 రోజులే లక్ష్యం!

మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతి-సాయిపల్లవి జంటగా ఓ ప్రేమకథా చిత్రం తెరకెక్కబోతున్న విషయం తెలిసిందే. త్వరలో కోల్‌కతాలో షూటింగ్ మొదలుకానుంది. తాజా సమాచారం ప్రకారం ఈ చిత్రాన్ని సాధ్యమైనంత తొందరలో పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నారట మణిరత్నం. 40 రోజుల నాన్‌స్టాప్ షెడ్యూల్‌తో కోల్‌కతా, పుదుచ్చేరి వంటి ప్రదేశాల్లో షూటింగ్‌ను పూర్తి చేయాలని, నవంబర్‌లోగా సినిమాను రిలీజ్ చేయాలనే ప్లానింగ్‌లో మేకర్స్ ఉన్నట్లు తెలిసింది.

కథారీత్యా యాక్షన్ ఘట్టాలు, గ్రాఫిక్స్‌కు ఎలాంటి అవకాశం లేకపోవడంతో నలభైరోజుల షూటింగ్ సరిపోతుందని యూనిట్ సభ్యులు భావిస్తున్నారట. చాలాకాలం విరామం తర్వాత మణిరత్నం ప్రేమకథను తెరకెక్కిస్తుండటంతో ఈ సినిమా కోసం ఆయన అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రానికి ఏ.ఆర్.రెహమాన్ సంగీతాన్నందిస్తుండటం మరో ఆకర్షణగా నిలుస్తున్నది.

